క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



యామినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి రూరల్: స్థానిక జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం నౌపడా శోభారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ సెలక్షన్‌లో పదో తరగతి చదువుతున్న కానూరు యామిని ప్రతిభ కనబర్చడం ద్వారా రాష్ట్రస్థాయి మూడువేల మీటర్ల పరుగుపందెం పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. యామినిని వ్యాయామ ఉపాధ్యాయులు బి.ఆదిశేషు, డి.సూర్యాకాంతం అభినందించారు.

ఎస్ఆర్‌సీ పురంలో పారిశుద్ధ్య పనులు



కాలువలో చెత్తను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

కంచిలి: మండలంలోని ఎస్ఆర్‌సీ పురం గ్రామంలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులను గురువారం చేపట్టారు. పురాతన డ్రైనేజీ చాలా ఏళ్లుగా నిర్వహణకు నోచుకోకపోవడంతో అందులో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయింది. దీంతో స్థానికులు అవస్థలు పడేవారు. ఈ పరిస్థితిలో సర్పంచ్ డొక్కరి తులసీబలరాం ప్రత్యేక దృష్టి సారించి జేసీబీతో కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగింపజేశారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి ఉచిత సంగీత శిక్షణ

మందస: మందస పట్టణంలోని కరణంవీధి జంక్షన్‌లో ఈ నెల 18వ తేదీ నుంచి సంగీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు స్పందన సంస్కృతిక వేదిక ప్రతినిధులు గురువారం తెలిపారు. నాలుగు రోజుల పాటు సంగీతం గురువైన ఆకోజు హిమకుమార్ శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు 8501919502, 9849457029, 9440321034 నంబర్లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రయాణ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న సింహాద్రి

సోంపేట: విద్యార్థులు బస్సులు ఎక్కేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సోంపేట ఏఎస్సై సింహాద్రి అన్నారు. బస్సు ప్రయాణంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. విద్యార్థులు తొందరపాటు పడితే ప్రమాదాలు కొనితెచ్చుకుంటారన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు, ఏపీఏవోలు రామినాయుడు, ఎం.ప్రసాద్ పాల్గొన్నారు.

పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ



క్రీడా సామగ్రి అందజేస్తున్న అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని 46 ప్రాథమిక, ఎనిమిది ప్రాథమికోన్నత, 16 ఉన్నత, రెండు కళాశాలలకు ఎమ్మార్సీలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈవో కురమాన అప్పారావు క్రీడా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాథమిక దశ నుంచే బాలలకు క్రీడలపై ఆసక్తి కల్గించేందుకు క్రీడా సామగ్రి దోహదపడతాయన్నారు. అనంతరం లైబ్రరీ బుక్స్, టాయిలెట్ మెటీరియల్స్‌ను ఉపాధ్యాయులకు అందజేశారు.

నారు తయారీపై శిక్షణ

పలాస: శ్రీకాకుళం కృషి విజ్ఞాన కేంద్రంలో ఉద్యాన పంటల నారు తయారీ, అంటు కట్టడంపై మూడు రోజులు శిక్షణ ఇస్తున్నట్టు పలాస ఉద్యానవన శాఖ అధికారి సీహెచ్ శంకర్‌దాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 8281440912 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



కొంచాడ హనీషా

కాశీబుగ్గ: రాష్ట్రస్థాయిలో సత్యసాయి విద్యాసంస్థలు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పలాస విద్యార్థిని కొంచాడ హనీషా ప్రతిభ కనబర్చింది. 2,585 పాఠశాలల నుంచి 1,12,952 మంది విద్యార్థులు పాల్గొనగా.. పలాస సత్యసాయి విద్యావిహార్‌కు చెందిన హనీషా ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది.



సోంపేట: కొర్లాంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



కోటబొమ్మాళి: కమలనాభపురంలో జెండాను ఆవిష్కరిస్తున్న టెక్కలి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి



కవిటి: వరకలో మాట్లాడుతున్న సమన్వయకర్త పిరియా సాయిరాజ్

సంక్షేమ సారథి సీఎం జగన్

సంక్షేమ పథకాల సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్'కార్యక్రమం ఉత్సాహగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. జేసీఎస్ ఇన్‌చార్జిలు, గృహసారథులు, వలంటీర్లు, నాయకులు కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.



ఇచ్ఛాపురం రూరల్: డొంకూరులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్



నందిగాం: దిమిలాడలో పార్టీ జెండాను ఎగురవేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి తదితరులు



పలాస: అల్లుకోలలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో అధికారులు



నందిగాం: పెద్దతామరాపల్లిలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జేసీఎస్ మండల ఇన్‌చార్జి జడ్యాద జయరాం, పార్టీ మండల అధ్యక్షుడు ఫాల్గుణరావు



మందస: భైరిసారంగపురంలో మాట్లాడుతున్న ఎంపీపీ దొక్కరి దానయ్య



కంచిలి: కొల్లూరులో డిస్‌ప్లే బోర్డు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి



కోటబొమ్మాళి: మహసాహెబ్‌పేటలో డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దుబ్బ వెంకటరమణారావు



టెక్కలి: రావివలసలో ప్రచారం చేస్తున్న సర్పంచ్ బాలకృష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్ తదితరులు



ఇచ్ఛాపురం: పదోవార్డులో గృహస్తులతో మాట్లాడుతున్న సమన్వయకర్త పిరియా సాయిరాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి



టెక్కలి: తొలుసూరుపల్లిలో జెండాను ఆవిష్కరిస్తున్న సమన్వయకర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి



సంతబొమ్మాళి: వడ్డితాండ్రలో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి



లబ్ధిని వివరిస్తున్న దువ్వాడ వాణి

సంతబొమ్మాళి: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. గోవిందపురం సచివాలయ పరిధి వడ్డీవాడ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధితో రాష్ట్రాన్ని ప్రగతి పథంలోకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకెళ్తున్నారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి, ఎంపీపీ మెరుగు రాజేశ్వరి, పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్లి జగన్నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు దువ్వాడ హైందవి, సంపతిరావు రాఘవరావు, ఎం.అప్పారావు, పి.రామకృష్ణ, జె.బాబురావు, ఆర్.రామిరెడ్డి, పల్లి రామారావు, పల్లి రామచంద్రరరావు ఉన్నారు.

మున్సిపాలిటీలో టౌన్‌ప్లానింగ్ ఆర్డీ తనిఖీ



మాట్లాడుతున్న రీజనల్ డైరెక్టర్ జయరాం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న జంట పట్టణాల్లో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ డిపార్ట్ డైరెక్టర్ జయరాం గురువారం పర్యటించారు. నిర్మాణంలో ఉన్న అభివృద్ధి పనులు, నిర్మాణాలు పూర్తి చేసుకున్న భవనాలను పరిశీలించారు. భవనాలకు అనుమతులు ఎలా ఇచ్చారు, ఏ ప్రాతిపదికన ఇచ్చారు, ఏ అధికారి వీటిని ధ్రువీకరించారనే కోణంలో వివరాలు సేకరించారు. ఇటీవల పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టిన నేపథ్యంలో ఆర్డీ పర్యటన చర్చనీయాంశమైంది. అనంతరం మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో టౌన్‌ప్లానింగ్ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కమిషనర్ నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో మందులు అందించండి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం: గ్రామాల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు వచ్చే రోగులకు పూర్తిస్థాయిలో మందులు అందజేయాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. నందిగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభ్యున్నతి కమిటీ సమావేశం వైద్యాధికారిణి అనిత ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణులకు పూర్తిస్థాయిలో వైద్యం అందాలనే ఉద్దేశంతో ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. అనంతరం పీహెచ్‌సీ ఆవరణలో నిర్మిస్తున్న ల్యాబ్ భవనాన్ని పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవో శివప్రసాద్, సలహా మండలి సభ్యులు జడ్యాడ జయరాం, తమిరి ఫాల్గుణరావు, దట్టి తనూజ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న మాధవరావు

మందస: ఉద్దానం కొబ్బరి రైతాంగాన్ని ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం నాయకుడు వంకల మాధవరావు కోరారు. హరిపురంలోని మార్పు గ్రంథాలయంలో విలేకరులతో గురువారం మాట్లాడారు. ప్రపంచ కొబ్బరి ఉత్పత్తిలో భారత దేశం మూడవ స్థానంలో ఉండగా.. ఏపీ దేశంలో నాలుగో స్థానంలో ఉందన్నారు. ఉద్దాన ప్రాంత రైతులు కొబ్బరి, జీడి పంటలపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రకృతి విపత్తులను ఎదుర్కొంటూ, కష్ట, నష్టాలను పడుతూ పంటలు పండిస్తున్నారన్నారు. చేతికి పంటలు వచ్చే సమయానికి దళారులు, వ్యాపారులు తక్కువ ధర రైతులకు అందిస్తున్నారన్నారు. రైతులకు నాణ్యమైన కొబ్బరి మొక్కలను సరఫరా చేయాలని, అంతరపంటలకు బోర్లు మంజూరు చేయాలని, మద్దతు ధర కల్పించాలని కోరారు. ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మామిడి భీమారావు, ప్రధాన కార్యదర్శి భైరి కూర్మారావు, ఉపాధ్యక్షుడు బంగ్లా కుమార్ ఉన్నారు.

అంతర పంటల సాగుకు స్పెషల్ డ్రైవ్

● డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు



మాట్లాడుతున్న పీడీ జీవీ చిట్టిరాజు

వజ్రపుకొత్తూరు: మండలంలోని 37 పంచాయతీల్లో జీడి, కొబ్బరి, ఇతర తోటల్లో అంతర పంటలు పండించేలా ఉద్యావనవన శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోషల్ ఆడిట్ ప్రజా వేదికను ఇన్‌చార్జి ఎంపీడీవో డిక్కల తిరుమలరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం పంచాయతీల వారీగా ఈ ఏడాది అక్టోబర్ 27 నుంచి నవంబర్ 15వ తేదీ వరకు ఈజీఎస్, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, సర్వశిక్షా అభియాన్ పనులపై ఆడిట్ నిర్వహిచారు. అంతర పంటల విషయంలో రైతులకు అవగాహన కల్పించి ప్రతి ఫీల్డు అసిస్టెంట్ దీనిని సీరియస్‌గా తీసుకుని నెల రోజుల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల్లో జరిగిన అవకతవకలు 16వ రౌండ్ సోషల్ ఆడిట్ వేదికగా బయటపడ్డాయి. 2022 ఏప్రిల్ ఒకటి నుంచి 2023 మార్చి 31వ తేదీల మధ్య ఆయా శాఖల వారీగా 37 పంచాయతీల్లో వెయ్యి పనులు చేపట్టగా రూ. 10.72 కోట్లు ఖర్చు చేశారు. కాగా ఎక్కువ శాతం మస్తర్లలో, నేమ్ బోర్డులు, వర్కు సైట్ బోర్డుల ఏర్పాటుల్లో అవకతవకలు జరిగినట్లు బట్టబయలైంది. ఈ సందర్భంగా మండల ప్రత్యేక ఆహ్వానితుడు యు.ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. మస్తర్లలో అక్రమాలు ఉన్నాయన్నారు. మండలం నుంచి వలసలు ఉన్నందున వీటిని నియంత్రించేందుకు జాబ్‌కార్డులు అదనంగా ఇచ్చి పనిదినాలు సంఖ్య పెంచాలని పీడీని కోరారు. మెటీరియల్ కాంపోనెంట్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తీర ప్రాంతంలోని 11 పంచాయతీల్లో ఉపాధి పనులు చేపట్టాలని కోరారు.

సైనూరు ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు

సైనూరు పంచాయతీ ఫీల్డు అసిస్టెంట్ జగదీశ్వరి బినామీ మస్తర్లు వేసినట్లు అదే పంచాయతీకి చెందిన సుగ్గు గీత సోషల్ ఆడిట్ బృందానికి ఫిర్యాదు చేశారు. జాబ్ కార్డులు మేట్ల వద్ద ఉంచడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. అయితే ఎలాంటి అక్రమాలు జరగలేదని ఆ గ్రామ వేతనదారులు ఫీల్డ్ అసిస్టెంట్‌కు మద్దతుగా పీడీకి వివరించారు. అలాగే కొండవూరులో జరిగిన పనులకు సంబంధించి నేమ్ బోర్డులు పెట్టకపోడంపై పీడీ చిట్టిరాజు గ్రహం వ్యక్తం చేశారు. శనివారంలోగా నేమ్ బోర్డులు రాయకుంటే సస్పెండ్ చేస్తామని ఫీల్డ్‌అసిస్టెంట్ శ్రీనివాసరావు, బీఎఫ్‌టీలను హెచ్చరించారు. కొండవూరు, మెట్టూరుల్లో జరిగిన పనుల్లో వేలి ముద్రలు, సంతకాలు లేకుండా, పనులకు హాజరు కాని వారిపేరున బిల్లులు చెల్లింపు చేశారని సోషల్ ఆడిట్ బృందం వెల్లడించింది. కార్యక్రమంలో డీవీవో లవరాజు, ఏపీడీ శైలజ, ఎస్ఆర్‌పీ వెంకటరమణ, ఏపీఓ పి.కేశవరావు, సర్పంచ్‌లు కె.భాస్కరరావు, గోవిందరావు పాల్గొన్నారు.

ఉన్నతి లబ్ధిదారులను ఎంపిక చేయండి

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని స్వయం సహాయక సంఘాల్లో 40 ఏళ్ల మధ్య వయసులో ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళలకు ప్రభుత్వం ఉన్నతి–మహిళా శక్తి పథకం ద్వారా ఆటోరిక్షాల రుణాల కోసం సున్నా వడ్డీకి అందిస్తుందని ఏపీఎం సనపల ప్రసాదరావు అన్నారు. గురువారం స్థానిక మండల మహిళా సమాఖ్య భవనంలో వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళల జీవనోపాధికి ఈ పథకాన్ని అమలు చేస్తుందన్నారు. అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు.

రోగులకు మెరుగైన సేవలు



మాట్లాడుతున్న ఎంపీపీ నీలవేణి

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయని వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులు, మంత్రి సీదిరి అప్పలరాజు కృషితో వజ్రపుకొత్తూరు మండలంలో ఆస్పత్రులను అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం వైద్యాధికారి కనిస్క అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అక్కుపల్లి, వెంకటాపురం పీహెచ్‌సీలను దాదాపు రూ.3.60 కోట్లతో నూతన భవనాలు నిర్మించి రోగులకు మెరుగైన వసతులు కల్పించామన్నారు. గోవిందపురం, వజ్రపుకొత్తూరు పీహెచ్‌సీలను ఆధునికీకరించేందుకు నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ బి.అప్పలస్వామి, ఇన్‌చార్జి ఎంపీడీవో డిక్కల తిరులమరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్ స్థానిక సర్పంచ్ పి.గురయ్యనాయుడు, పల్లిసారథి సర్పంచ్ బత్తిన కుసుమ ఉన్నారు.

అయ్యప్పస్వామికి పూజలు



పడి పూజ చేస్తున్న స్వాములు

వజ్రపుకొత్తూరు: పూండిలో కొలువైన హరిహర పుత్రుడు అయ్యప్పస్వామికి పూజలు గురువారం కన్నుల పండువగా జరిగాయి. ఏటా నవంబర్ 16న శబరిమలలో స్వామివారి ఆలయాన్ని తెరచి పడి పూజ నిర్వహించే విధంగానే ఇక్కడ కూడా పడి పూజ, అభిషేకాలు చేయడం ఆనవాయతీ. ఇందులో భాగంగా జరిగిన పూజల్లో జిల్లా నలుమూలల నుంచి సుమారు ఐదు వేల మంది స్వాములు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉదయం ఆరు గంటల నుంచి గురుస్వామి కర్ని దశరథరావు ఆధ్వర్యంలో 121 నారికేళ జలం, నెయ్యాభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వేడుకగా ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు



కంచిలి: ఆలయ ప్రతిష్టా మహోత్సవంలో ఎమ్మెల్సీ రామారావు దంపతులు



కవిటి: బెజ్జిపుట్టుగలో పాతపట్నం అమ్మవారి పూజల్లో జడ్పీచైర్‌పర్సన్ పిరియా విజయ

కంచిలి: బెల్లుపడ గ్రామంలో పునఃనిర్మించిన రాధాకృష్ణ ఆలయం ప్రతిష్టా మహోత్సవాలు గురువారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నర్తు రామారావు, చామంతి దంపతులు, జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, మండల అధ్యక్షుడు పైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షిలు హాజరై పూజలు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు ఇప్పిలి కృష్ణారావు, స్థానిక సర్పంచ్ అయిధం జయరాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం

కర్తలి గ్రామంలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. ఆమెతోపాటు స్థానిక ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నీలమణిదుర్గమ్మకు పూజలు

కవిటి: బెజ్జిపుట్టుగ పిరియా వీధిలో వెలసిన పాతపట్నం అమ్మవారు (నీలమణిదుర్గమ్మ)ను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం దర్శనం చేసుకుని పూజలు చేశారు. అమ్మవారి ఆలయం 16వ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆమె వెంట బెజ్జిపుట్టుగ, జగతి పంచాయతీల సర్పంచ్‌లు ఎస్‌పీ నారాయణ స్వామి, పూడి వరప్రసాద్ ఉన్నారు.

సంక్షిప్తంగా...


కణితూరులో పంటకోత ప్రయోగం

నందిగాం: కణితూరులో పంటకోత ప్రయోగం గురువారం నిర్వహించారు. ఏఎస్ఓ పీహెచ్ సూర్యనారాయణ పర్యవేక్షణలో వీఏఏ కె.విఘ్నేష్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన మెట్ట మన్మథరావు పొలంలో ఈ ప్రయోగం చేపట్టారు.

ఘనంగా సత్యసాయి జన్మదిన వేడుకలు

ఇచ్ఛాపురం రూరల్: భగవాన్ శ్రీసత్యసాయి బాబా వారి 98వ జయంతోత్సవాలను గురువారం బూర్జపాడులో భక్తులు ఘనంగా నిర్వహించారు. బూర్జపాడు, సన్యాసిపుట్టుగ గ్రామాలకు చెందిన భక్తులు సాయిబాబా చిత్రపటాన్ని నామసంకీర్తనలతో ఊరేగించారు. ఈ సందర్భంగా చిన్నారులు పురవీధుల్లో ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.


తక్షణసాయం అందజేత



తులసమ్మకు సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: మున్సిపాలిటీ 22వ వార్డు బత్తుల వీధికి దేవరాజ్ బెహరా ఇటీవల మృతి చెందారు. ఇతను వైఎస్సార్ బీమా పాలసీదారు. దీంతో నామినీగా ఉన్న ఆమె భార్య తులసమ్మకు తక్షణ సాయంగా రూ. పది వేలు మంజూరైంది. ఈ మొత్తాన్ని 22వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి లోకనాథ బెహరా చేతుల మీదుగా తులసమ్మకు గురువారం అందజేశారు. వెల్ఫేర్ సెక్రటరీ బాబూరావు పాల్గొన్నారు.

మత్స్య అవతారంలో బ్రహ్మజనార్దనుడు



సోంపేట: బారువ గ్రామంలో కొలువై ఉన్న బ్రహ్మజనార్దన స్వామి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం భక్తులకు మత్స్య అవతారంలో దర్శమిచ్చారు. ప్రధాన అర్చకులు భువనేశ్వర్ పాణిగ్రాహి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బారువ పరిసర గ్రామాల భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి.. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ఏసీడీపీ వై.లావణ్య అన్నారు. మున్సిపాలిటీలోని కేజీబీవీలో బాల్యవివాహాలపై గురవారం విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాల నిర్మూలన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీడీఎస్ సిబ్బంది టి.లక్ష్మణరావు, కేజీబీవీ ఎస్‌వో పి.శిరీష, సోషల్ వర్కర్ మధుమీనాక్షి, చైల్డ్‌లైన్ సూపర్‌వైజర్ జాస్మిన్‌కుమారి పాల్గొన్నారు.